
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పెద్దతనం

ఢిల్లీ నగరపు చలి అంతగా అలవాటు లేని నాలాంటి వారిని కొద్దిగా వణికిస్తోంది. ఆఫీస్ పని మీద వచ్చిన నేను రేపు మరో మీటింగ్ ముగించుకున్నాకా తిరుగు ప్రయాణం.

మళ్ళీ రేపు కుదురుతుందో, లేదో పిల్లలకికొందామనుకున్న స్వెటర్లూ, టోపీలు లాంటివన్నీ ఈ రోజే కొనేస్తే మంచిదేమో! అనుకుంటూ డ్రైవర్ కి ఫోన్ చేశాను.

" సరే మేడం! మార్కెట్ కి తీసుకెళతాను!" అన్నాడు డ్రైవర్ ప్రమోద్.

" టీ తాగి వచ్చేస్తా పదినిమిషాల్లో" అన్నాను అతనితో.

" ఓకే మేడం!" అన్నాడు ప్రమోద్.

టీ తాగి బయలుదేరాను. ప్రమోద్ ఢిల్లీ కి చెందిన అతను, అన్ని దార్లు బాగా తెలుసు, అలాగే షాపులు అవీ కూడా.

"ఇది చాలా మంచి షాపుమేడం! ఇక్కడ సరుకు నాణ్యంగా, ధరలు సరసంగా ఉంటాయి" అన్నాడు ఓ పెద్ద షాపు ముందు ఆపుతూ, అచ్చం గా సేల్స్ మాన్ లా..

నవ్వుతూ చూశానతని వైపు.

" నాకేమీ కమీషన్లు అవి ఉండవు మేడం, నిజం.! మీకు మంచి వస్తువులు అందాలనే ఇక్కడకి తెచ్చాను" అన్నాడు అతను..

నేను నొచ్చుకున్నాను.. " అయ్యో! నేనందుకు నవ్వలేదు ప్రమోద్, మీరు చెప్పిన తీరుకి నవ్వొచ్చింది అంతే!' అన్నాను.

ఆ షాప్ పెద్దగా ఉంది, గాజు తలుపులున్నాయి మధ్యలో, అవి తోసుకుంటూ లోపలకి వెళ్ళాను.

" ఏం కావాలి మేడం జీ!" అడిగిందో పెద్దావిడ.. పొట్టిగా, మధ్యస్థమైన లావుతో ఉంది. పచ్చటి సల్వార్ కమీజ్ వేసుకుని వత్తైన ముడి పెట్టుకుని ఉంది. ముడి ఊడిపోకుండా గుచ్చిన పెద్ద ప్లాస్టిక్ ముడి పిన్ను.. ఆ ముఖం, అంత కంటే ముందు ఆ ముడి పిన్నెక్కడో చూసినట్టనిపించడం చిత్రమే, కానీ నిజం.

నాకు కావలసినవి చెప్పగానే " అరే ఛోటూ, మేం సాబ్ కో బచ్చోకే అచ్చే క్వాలిటీ వాలా స్వెటర్స్ దిఖావ్" అంటూ ఒక పిల్లాడిని పిలిచారావిడ గిర్రున వెనక్కి తిరుగుతూ..

ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తున్న అందమైన వత్తైన ముడి, దానికున్న పిన్ను, గులాబీ పువ్వు ఒక పక్కన, దాని మధ్యలో తెల్లటి రాయి పొదిగిన ఊస లాంటి ముడి పిన్ను.. నాకెంతో పరిచయమైన పిన్ను.

" కమలేందర్ ఆంటీ!" అన్నాను అప్రయత్నంగా.

ఆమాటకు గిరుక్కున వెనక్కి తిరిగిన ఆవిడ ముఖం నిండా అంతులేని ఆశ్చర్యం.. " మీరు! మీరు పద్మిని కదూ!" అన్నారావిడ కొత్త సందేహంగా..

" అవును, బానే గుర్తు పట్టారే!" అన్నాను నేను నవ్వుతూ. ఆవిడ చెయ్యి పట్టుకుంటూ.. ఆవిడ నా చేతిని అందుకుని నన్ను గట్టిగా హత్తుకున్నారు. ఆ దెబ్బకి జుట్టు ముడి విడి పోయి జలపాతంలా కిందకి జారిన మెత్తని ఆవిడ వత్తైన జుట్టు..

" ఎంత బావుంటుందాంటీ మీ జుట్టు,క్రమ తప్పకుండా మెహెందీ పెడతారే?" గతంలో నేనడిగిన ప్రశ్న..

" ఇంట్లోనే ఉంటాను కదా, టైం దొరుకుతుంది" అనేవారావిడ.

" ఇక్కడ ఇష్యూ టైము కాదు, శ్రద్ధ!" అనుకునేదాన్ని..

" ఆంటీ, మీరిక్కడ!!" అన్నాను ఆవిడవైపు చూస్తూ..

ఇంతకు ముందు కంటే ఎంతో బాగున్నారావిడ. ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నట్టు కనిపించారు, పెరిగిన వయసు కనిపిస్తున్నా, అది కేవలం అది ఒక సంఖ్యామాత్రంగానే అనిపించిందావిడ ఉత్సాహం చూస్తుంటే.

" అరే ఛోటూ, మేడం ని నేను చూసుకుంటా, నువ్వవన్ని నాకిచ్చిపో, అలాగే మేడం కి మంచి కడక్ అద్రక్ చాయ్" అంటూ చెప్పి.. నా చెయ్యిషాప్ లో ఖాళీగా ఉన్న ఒక మూల కి తీసుకెళ్ళారావిడ నా చెయ్యి పట్టుకుని.. అక్కడ వేసి ఉన్న తెల్లటి పరుపు మీద ఒక వైపు ఆవిడ కూర్చుని, నన్నూ కూర్చోమన్నారు.

" ఎలా ఉన్నారు పద్మినీ? పిల్లలు, సుధీర్ బావున్నారా?" అడిగారావిడ.

" మేమంతా బావున్నాం, అద్వితి ఆరోక్లాస్, అనన్య నాలుగు" అని చెప్పాను.

" మీరు బావున్నారు కదా! మిమ్మల్నిలా చూడడం ఎంత బావుందో!" అన్నాను నేను.

" నిజమే, ఇదంతా డింపి బేటా చలవ" అన్నారావిడ.

ఛెళ్ళున కొట్టినట్టు ఉలిక్కిపడ్డాను.. "డింపీ బేటా చలవా? ఏమన్నారీవిడ? కొడుకు పోయిన కొన్నిరోజులకి ఆవిడ అతని బాధ్యత తప్ప తనకి బరువేనని, ఆస్థి కాగితాల దగ్గరనించీ అన్నీ తీసేసుకున్న కోడలి చలవా ఈవిడ ఈనాటి సంతోషం? ఎలా? ఆ తర్వాత మారిందా ఆ పిల్ల? ఇప్పుడీవిడ ఎక్కడున్నారు? ఎవరితో ఉన్నారు." కనీసం డెబ్బై ఏళ్ళుంటాయావిడకి. ముందు లేని విశ్వాసం, ఉత్సాహం ఆవిడలో. అది చూస్తే ముచ్చటగా ఉంది నాకు.

" అంటే డింపీ, మీరు?" అంటూ ఆగాను..

" లేదు, మేము కలిసి ఉండడం లేదు.. బహుశా ఎప్పటికీ ఉండము, బబ్లీ, సోనూ లని నేనే స్కూల్ కి వెళ్ళి వారానికి ఒకసారి చూసి వస్తాను.. ప్రిన్సిపల్ గారి పర్మిషన్ తో, అప్పుడైతే మనకి ప్రాబ్లెం ఉండదు కదా.. నేను తీసుకెళ్ళే అమృత్ సరీ కుల్చా,చోలే ల కోసం ఎంత ఎదురు చూస్తారో పాపం బిడ్డలు! " అంటున్నారావిడ.

" నిజమా! డింపీ కూడా ఇక్కడే ఉందా?" అన్నాను.

" హా, తనూ, తన అమ్మా, నాన్నా కలిసి ఉంటారు, సౌత్ ఢిల్లీ లో" అనగానే

" మీ ఫ్లాట్ లోనా?" అన్నాను సందేహంగా.

" నా కుటుంబమే కదూ! బబ్లీ, సోనూ నా వాళ్ళు కాదూ? పర్మీత్ తీపి గుర్తులు కాదూ!" అన్నారావిడ.. తళుక్కుమన్న చిన్న నీటి ముత్యం ఆవిడ కళ్ళలో.

అది ఇల్లు తనకు లేదన్న బాధ కాదు, మనవలకి మరింత దగ్గరగా ఉండలేనన్న బాధ మాత్రమే అని నాకు తెలుసు.

" పరవాలేదు, వాళ్ళని కనీసం వారానికొకసారి కలుస్తాను కదా! చాలు" అన్నారావిడే వెంటనే..

ఢిల్లీ నించి వచ్చారీ కుటుంబం హైదరాబాద్ లో మా ఫ్లాట్స్ కి. మా ఫ్లాట్ కి ఎదురుగా ఉన్న ఫ్లాట్ లో ఉండేవారు.

డింపీ అనే దీపిక, ఆవిడ కోడలు, పర్మీత్ అనే ఆవిడ కొడుకు, బబ్లీ, సోనీ అనే ఇద్దరు చిన్నపిల్లలు, ఈవిడ. ఇదీ వారి కుటుంబం.

కమలేందర్ ఆంటీ చాలా అందంగా ఉండేవారు, తన ఆరోగ్యం పట్ల, అందం పట్ల ఎంతో శ్రద్ధగా ఉండేవారు. కుటుంబం అంతా కూడా సంతోషంగానే ఉండేవారు. ఇద్దరూ ఉద్యోగాలకి వెళ్తే ఆంటీ పిల్లలని చూసుకునేవారు, ఆవిడ చదువున్నావిడ కావటం చేత వాళ్ళ హోం వర్క్ లూ అవీ చేయించేవారు. వంట, పిల్లా ఆలనా, పాలన ల్లో ఆమెకి రోజులు సునాయాసంగా గడిచిపోయేవి. ఇరుగుపొరుగులతో ఆవిడే సందడిగా, కలివిడిగా ఉండేవారు. ఆవిడ కోడలు మాట్లాడడం తక్కువే..

నడుస్తున్న కాలం సజావుగా ఉందనుకుంటూ ఉండగానే పిల్లలని ఆంటీ దగ్గర వదిలి కొత్తగా కొనుక్కున బైక్ మీద హైవే మీద లాంగ్ డ్రైవ్ కి వెళ్ళిన పర్మీత్, డింపీ లకి పెద్ద యాక్సిడెంటే జరిగింది.వేగంగా బైక్ నడుపుతున్న పర్మీత్ ఎదురుగా వస్తున్న లారీని గుద్దుకునేసరికి ఎగిరివెళ్ళి పడ్డాడు. హెల్మెట్ బెల్ట్ పెట్టుకోనందువల్ల అది ఎగిరి పక్కకి పడి పోయి తలకి పెద్దదెబ్బ తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. చాలా దెబ్బలు, రెండు ఫ్రాక్చర్లతో బయటపడింది డింపీ. ఆంటీకి అలాంటి, ఇలాంటీ షాక్ కాదు, తేరుకోవడానికి కొన్ని రోజులు పట్టింది.

అయినా కన్న బిడ్డని పోగోట్టుకున్న బాధని ని కడుపులో దిగమ్రింగి మరీ కోడలికి సేవ చేశారు ఆంటీ. డింపీ తల్లి, తండ్రీ వచ్చి కొన్నాళ్ళుండి వెళ్ళారు. తరచూ వస్తూ ఉండేవారు కానీ డింపీ ని, పిల్లలనీ తనే అన్నీ అయ్యి కాచారు ఆంటీ.. ఆ సమయంలోనే మా పరిచయం స్నేహంగా, ఏదో చెప్పలేని బంధంగా రూపొందింది.

" ఒక్కరూ ఇబ్బంది పడతారేమో" అని సుధీర్ తరచూ ఆవిడకి కావలసినవి కనుక్కోమనడం..

మా పిల్లలతో పాటు వాళ్ళ పిల్లలనీ కలుపుకోవడం ..ఇలా ఎన్నో చిన్న చిన్న విషయాలే, పెద్దగా మేము చేసినదంటూ ఏమీ లేదు,

దాదాపు మూడు నెలలు పట్టింది డింపీ కోలుకోవడానికి. కర్ర సాయంతో నడిచే కోడలికి చేతి కర్రలా కాపు కాశారాంటీ. ఆమె మళ్ళీ ఆఫీస్ కి వెళ్ళే వెసులుబాటు వచ్చేవరకూ ఆవిడ వెన్నంటే ఉన్నారు. తనతో పాటు కోడలు కూడా కలిగిన కష్టాన్ని మరిచిపోయే ప్రయత్నాలు చేశారు.

" మా వంశానికేదో శాపముందేమో పద్మినీ, వాళ్ళ పాపా కూడా ఇంచుమించి ఇదే వయసులో" అంటూ చెప్పలేక చెప్పేవారు..

" అత్త కోడళ్ళిద్దరూ ఎంత అన్యోన్యంగా ఉంటారో" అనుకునేవారందరూ.. నిజం వేరు..

"సుధీర్ ఉద్యోగం కోసమేగా ఇక్కడకి వచ్చారు, ఇప్పుడవసరం ఏముంది బేటా!పిల్లలని తీసుకుని నువ్వు ఢిల్లీ వచ్చెయ్యి. అలాగే ఆస్థిపాస్తుల వివరాలు కూడా అడిగేస్తే సరిపోతుంది" అంటూ తల్లి తండ్రి తరచుగా చెప్తూ ఉంటే డింపీకి అది నిజమే అనిపించసాగింది.

“హఠాత్తుగా ఈవిడకేదైనా అయితే? ఢిల్లీ లో ఉన్న ఫ్లాట్, పంజాబ్ లో స్వంత ఊర్లో ఉన్న ఇల్లు, బాంక్ డిపాజిట్లు ఇవన్నీ ఏమవుతాయి? కూతురికిచ్చేస్తే? “అన్న ఆలోచనలామెని కుదురుగా ఉండనివ్వలేదు..

" దీదీ! మీ ఆస్థి అంతా ఎలాగూ పిల్లలకి చెందవలసినదేగా, ఆ రకంగా ఒక పత్రం తయారుచేసుకుంటే ఓ పని అయిపోతుందిగా" అన్నాడు డింపీ తండి ఆంటీ తో.

" పర్మీతే లేకపోయాక, అదంతా వాడి పిల్లలదేగా, నేనుంచుకునేం ప్రయోజనం! అనుకుందావిడ.. కూతురు కోయల్ కి అదే మాట చెప్పింది..

" నేను, వీరు వస్తాము మరో రెండు మూడు రోజుల్లో, నువ్వు కంగారు పడి ఏమీ చెయ్యకు ఇప్పుడే" హెచ్చరించింది ఆవిడ కూతురు కోయల్..

నట్టేట ముంచేది నమ్మకమే! బేటా పరవాలేదు రా, నువ్వెంతో డింపీ అంత కాదా నాకు?” అందావిడ.. అలవోకగా సంతకాలు జరిగాయి.. పేపర్లు ఎవరిదగ్గరున్నా పిల్లలు మనవాళ్ళే కదా, డింపీ మాత్రం మన బేటా కాదా! “ అది ఆవిడ మాట. కోయల్ మరి మాట్లాడ లేదు.

" ఈ ఫోన్ నీ దగ్గరుంచుకో, స్పీడ్ డయల్ లో నా నంబర్ పెట్టాను, ఎప్పుడవసరం అయినా కాల్ చెయ్యి, ఒకటి నొక్కితే చాలు" అంటూ చెప్పింది మరదలి పుట్టింటి సంగతి తెలిసిన ఆ అమ్మాయి.

తన మాటనీ, ఆ సాధనాన్నీ కూడా పట్టించుకోలేదు ఆవిడ..

" మా, కొన్నాళ్ళు నేను మా అమ్మా వాళ్ళ దగ్గరకు వెళ్ళి వస్తాను, మీరు మా దీదీ వాళ్ళ దగ్గరుండండి, సాయంత్రం వచ్చి తీసుకెళ్తుంది" అంటూ చెప్పింది డింపీ, ఆవిడ పెద్దగా ఊ కానీ, ఊహూ కానీ అనే అవసరం రాలేదు.

"అవును దీదీ, ఒక్కరే ఉండలేరు, మంచి పని చేశావు బేటా అంటున్న వియ్యంకుడూ, మనిషికి రెండు చొప్పున సర్దిన పెట్టేలు"..

రాత్రి డింపీ కి వరసకి అక్క అయ్యే దూరపు చుట్టం వచ్చింది కార్లో, కానీ ఆవిడని తమింటికి కాక ఒక చిన్న వృద్ధాశ్రమానికి తీసుకెళ్ళి దింపేసింది.. తమ ఇంట్లో పెయింటింగ్ జరుగుతోంది కనక మరో రెండు రోజుల్లో వస్తానని, అప్పటివరకూ తన స్నేహితురాలి ఇల్లని అబద్ధం చెప్పింది.. బోర్డ్ లేకపోయినా అక్కడి పరిస్థితి త్వరగానే అర్ధం అయింది పెద్దావిడ కి..

అప్పుడొచ్చిందావిడకి కొడుకు పోయినప్పటికంటే ఎక్కువగా దు:ఖం. తనని వదిలించుకున్నందుకు కాదు.

"మీ కొడుకు పోయాకా మీకు నాకు ఏం సంబంధం లేదు, మీరు దయచేసి వెళ్ళండి అంటే తనే ఆనందంగా వెళ్ళిపోయేది, ఇంత అసహజంగా, మోసపూరితంగా ప్రవర్తించిన వాళ్ళ మీద కోపం వచ్చింది.. అక్కడ ఉండలేక పోయింది, అప్పుడు వెతుక్కుంది, కూతురిచ్చిన, ఛార్జ్ పెట్టనందున బేటరీ లేని ఫోన్ ని..

నిర్వాహకుల సాయంతో చార్జ్ చేసుకుని ఒకటి నొక్కి కూతురికి సంగతంతా చెప్పింది. రాత్రికి రాతి వచ్చారు తీసుకెళ్ళడానికి..

" మీతో వస్తాను కానీ, మీ ఇంట్లో ఉండను, ఉండలేను.. మన సంప్రదాయంలో, మన కుటుంబంలో కూతురింట విస్తరి వేస్తే చాలా తప్పు, భోజనం ఏం ఖర్మ నీరు కూడా తాగకూడదు" అంటున్న తల్లికెలా చెప్పాలో అర్ధం కాలేదు కోయల్ కి.

ఈ కాలంలో కూడా ఈ పట్టుదలేమిటమ్మా? ఆస్థంతా అక్కడిచ్చేసి చేతిలో ఏమీ లేకుండా ఎలా ఉంటావు? ఎక్కడుంటావు? అని శతవిధాల చెప్పినా ఆవిడ వినలేదు..

" నువ్వు, అల్లుడు నాకొక సహాయం చెయ్యండి. ఒక చిన్న ఇల్లు చూసి, స్వెట్టర్లు అల్లే మిషన్ కొనిపెట్టండి. అప్పుగానే! ప్రతీ పైసా తీర్చేస్తాను. ఢిల్లీ కయ్యే టిక్కట్టుతో సహా.. అది కూడా మరో దారి లేక ఒప్పుకుంటున్నాను తప్ప మరోటి కాదు, ఈ విషయంలో బలవంత పెట్టద్దు, పైనున్న మీ పాపా కూడా మెచ్చరు!" అంది.

అలా మొదలయింది ఆవిడ మరో ప్రస్థానం. ఒక చిన్న కిచెన్,దానికి ఆనుకుని ఒక గది.. అక్కడ రోజూ అల్లే స్వెట్టర్లు, రుచిగా తయారయ్యే వంటలు.. అవి రెండే ఆవిడకి జీవనోపాధి అయ్యాయి. దగ్గరున్న షాపులకి చలికాలానికి సరిపడా స్వెట్టర్లు అల్లి అందించడం, చుట్టుపక్కల నాలుగిళ్ళల్లో కాలేజీ పిల్లలకి, బ్రహ్మచారులైన ఉద్యోగస్థులకి ఇంటి భోజనం పంపడం.. ఇలా.. అలా మొదలై ఈ రోజు షాపు ని చూసుకునే సూపర్ వైజర్ స్థాయి కి వచ్చింది..

ఇదంతా ఆవిడ చెప్తుంటే కళ్ళ నీళ్ళు తిరిగాయి నాకు, ఆవిడ పడిన కష్టాలకి కాదు, ఎదురొడ్డిన తీరుకి..

మిమ్మల్ని బలవంతంగా ఆశ్రమానికి పంపిన విషయమే మాకు ఆలస్యంగా తెలిసింది. " చెప్పకుండా ఆంటీ ఎక్కడకి వెళ్ళిపోయారా అనుకున్నాను" అన్నాను క్షమార్పణ ధ్వనిస్తున్న గొంతుతో.

" పరవాలేదు బేటా, అదో కలలా అయిపోయింది" అన్నారావిడ.

" ఇంత జరుగుతూ ఉంటే డింపీ వాళ్ళేమీ అనలేదా?" అన్నాను జవాబు తెలిసినదే అయినా..

" లేదుగా, చెప్పాను కదా, డింపీ బేటా అలా ప్రవర్తించడం వల్ల నాలోకి నేను తొంగి చూసుకుని విశ్వాసాన్ని నింపుకోగలిగాను. లేదంటే ఎప్పటికీ అలాగే ఇంట్లో ఓ సామానులా పడి ఉండేదాన్నేమో! అందుకే ముందు డింపీ కే థాంక్స్.

కానీ పిల్లలని చూడాలని మాత్రం మనసు కొట్టుకుపోయేది, ఎంతైనా నా కొడుకు పిల్లలు కదా!

ఒకటి రెండు సార్లు వెళ్ళి అడిగితే కుదరదన్నారు మా వియ్యంకుడు. అందుకే మా ఓనర్ లాయర్ గారి సహాయంతో, స్కూల్ ప్రిన్సిపల్ గారితో మాట్లాడి ఆయన పర్మిషన్ తీసుకుని ప్రతీ శుక్రవారం కలుస్తాను పిల్లలని. ప్రిన్సిపల్ నించి కబురు వెళ్ళేసరికి మరి మాట్లాడ లేక ఒప్పుకోవలసి వచ్చింది. ప్రతీ శుక్రవారం వాళ్ళకి నచ్చేవి వండి తీసుకెళ్ళి దగ్గరుండి తినిపించి, కబుర్లు చెప్పి వస్తాను.

నేనెప్పుడూ వయసయిపోతోందని అనుకోలేదు పద్మిని, కానీ ఈ పెద్దతనం లో నాకున్న ఒకే ఒక కోరిక వాళ్ళిద్దరితో గడపడం, అది తీరుతున్నందుకు ఎంతో ఆనందం!! మళ్ళీ శుక్రవారం వరకూ అవి భద్రంగా దాచుకుంటాను ఇక్కడ" అన్నారు తన హృదయం మీద చెయ్యి వేసుకుంటూ..

ఆచేతిని అలాగే నా చేతిలోకి తీసుకుని ఎంత సేపున్నానో నాకే తెలీదు. ఆవిడ పెద్దతనం వయసుది కాదు మనసుది, నాకా విషయం బాగా తెలుసు.

**నా మాట: పెద్దవాళ్ళని, పిల్లలు వృద్ధాశ్రమాల్లో దింపేయడం అనే అంశం మీద కథ రాయకూడదని ఎప్పుడో అనుకున్నాను. ఈ మధ్య నాకు అతి దగ్గరగా జరిగిన సంఘటనలవల్ల ఈ కథ కి శ్రీకారం చుట్టినా, దాన్ని కొంత ప్రత్యేకంగా ముగించాల్న ఆలోచనతో ఈ కథ రాశాను. కాలూ, చెయ్యి కదలలేని పరిస్థితి వస్తే తప్ప పెద్దతనం చాతకాని తనం కాదని చెప్పాలనే నా ఆశ.**

●●●

Click here to share your comments on this story